www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 15 అక్టోబర్ 2025
5
పశ్చిమ గోదావరి




విద్యారంగంలో సమూల మార్పులు

ఆచంట: ప్రభుత్వం విద్యారంగంలో సమూలమైన మార్పులు తీసుకొచ్చి యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడేలా చర్యలు తీసుకుంటుందని ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. మంగళవారం వల్లూరు, భీమలాపురం గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల వద్ద ఆయా సర్పంచులు నేలపూడి బేబీ, గుబ్బల మాధవరావు అధ్యక్షతన పల్లెపల్లెకు మన పితాని కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన సమావేశాల్లో పాల్గొని ప్రజల వద్ద నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా పితాని మాట్లాడుతూ వల్లూరులో శ్మశాన వాటికల అభివృద్ధి, తాగునీరు, డ్రెయినేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. భీమలాపురంలో అధ్వానంగా ఉన్న ఏటిగట్టు రూ.12 లక్షలతో మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి సర్పంచి గుబ్బల మాధవరావు, నేతలు చిలుకూరి సీతారాం, జవ్వాది బాలాజీ శ్రీనివాసు, తాళం శ్రీనివాసు, తహశీల్దార్ జి.కనకరాజు, ఎంపిడిఒ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

భారతీయ వారసత్వం లౌకిక రాజ్యం

- పాలకుల విధానాలతో లౌకిక రాజ్యానికి తూట్లు
- ప్రజలందరి ఆకాంక్షలకు ప్రతిరూపమైన రాజ్యాంగాన్ని కాపాడాలి
- రాజ్యాంగానికి విరుద్ధంగా ఎన్నికల కమిషన్ వైఖరి
- కోర్టు తీర్పును ప్రభుత్వమే ఉల్లంఘిస్తే శిక్షించేది ఎవరు
- లౌకిక సదస్సులో మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్.శర్మ
- సమైక్యతా స్ఫూర్తితో రాజ్యాంగాన్ని కాపాడాలి
- దారి దీపం ఎడిటర్ డివిఎస్.వర్మ



సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్.శర్మ

ప్రజాశక్తి - భీమవరం

ప్రజలందరి ఆకాంక్షలకు ప్రతిరూపంగా ఉన్న రాజ్యాంగంలో లౌకిక రాజ్యం భారతీయ వారసత్వమని మాజీ ఎంఎల్‌సి, ప్రజాశక్తి పూర్వ ఎడిటర్ ఎంవిఎస్.శర్మ అన్నారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో లౌకిక వేదిక ఆధ్వర్యంలో లౌకిక సదస్సును మంగళవారం నిర్వహించారు. సదస్సుకు దారి దీపం మాసపత్రిక సంపాదకులు డివిఎస్.వర్మ అధ్యక్షత వహించారు. ముఖ్యవక్త ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ రాజ్యాంగ పీఠికలో లౌకికత్వం అనే పదం లేదని ఒక వ్యక్తి వేసిన పిటీషన్‌ను సుప్రీంకోర్టు కొట్టిపారేసిందన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి లౌకికత్వం, ప్రజాస్వామ్యం ప్రతిరూపాలన్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి వచ్చిన వారు రాజ్యాంగానికి లోబడి పరిపాలన చేయకుండా దానికి తూట్లు పొడుస్తున్నారన్నారు. స్వాతంత్రం వచ్చినప్పుడు దానిలో పాల్గొన్న ప్రజానీకం ప్రజాస్వామ్యాన్ని కోరుకున్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రజాస్వామ్యబద్ధంగా వేయాల్సిన ఓటు హక్కు ప్రమాదంలో పడిందని, రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఎన్నికల కమిషన్‌నే దీనికి కారణమని అన్నారు. రాజ్యాంగాన్ని పిల్లలకు ఆస్తిగా సంక్రమించేదిగా చెప్పాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. 8 గంటల పని దినాలుగా ఉన్న హక్కుని 13 గంటలకు పెంచుతూ కార్మికుల హక్కులను తుంగలోకి తొక్కుతూ కూటమి ప్రభుత్వం చట్టం చేసిందన్నారు. కొత్త తరానికి రాజ్యాంగంపై జరుగుతున్న దాడిని తెలియజేయాలన్నారు. పెన్షనర్లను విభజించే హక్కు లేదని 1982లో సుప్రీంకోర్టు చెప్పిందని, ఈ తీర్పునకు వ్యతిరేకంగా ప్రస్తుతం రివ్యూ పిటీషన్ కేంద్ర ప్రభుత్వం వేసిందన్నారు. అదానీ, అంబానీలకు మాత్రం అన్ని రకాల భూములు కట్టబెడుతున్నారని ఆరోపించారు. 2023లో అదానీ అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహన్‌రెడ్డితో విద్యుత్ ఒప్పందాన్ని చేసుకున్నారని, దీనివల్ల సుమారు రూ.పది లక్షల కోట్లు నష్టపోతామని విద్యుత్ శాఖాధికారులు చెప్పినా జగన్ వినకుండా రూ.7,500 కోట్లు తీసుకుని ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. దీనిపై అమెరికా ఎఫ్‌బిఐతో విచారణ చేసి కేసు నమోదు చేసిందని, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం దీనిపై కనీసం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కోర్టు తీర్పును ప్రభుత్వమే ఉల్లంఘిస్తే శిక్ష ఎవరు వేస్తారని ప్రశ్నించారు. లౌకికత్వం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం వల్ల సమసమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యారంగంలో అనేక మార్పులు తీసుకొచ్చి రకరకాల సిలబస్ తీసుకొస్తున్నారని, అయితే ఆయా ప్రాంతాలకు తగినట్టుగా సిలబస్ ఉండాలని చెప్పారు. వైద్యం కూడా ప్రభుత్వ ఆధీనంలో ఉండాలన్నారు. ట్రంప్ సుంకాలు వ్యవసాయ ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. ముఖ్యంగా ఆక్వా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అయితే మోడీ, చంద్రబాబు ట్రంప్ సుంకాలపై కనీసం మాట్లాడకపోవడం దారుణమన్నారు. సదస్సులో పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గాతల జేమ్స్, రిటైర్డ్ ఉపాధ్యాయులు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

రాజ్యాంగ ప్రచార వేదిక కమిటీ ఎన్నిక

లౌకిక వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన లౌకిక సదస్సులో రాజ్యాంగ ప్రచార వేదిక నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా దారి దీపం మాసపత్రిక ఎడిటర్ డివిఎస్.వర్మ, సభ్యులుగా ప్రముఖ వైద్యులు డాక్టర్ రమేష్ చంద్రబాబు, ప్రముఖ కంటి వైద్య నిపుణులు హుస్సేన్, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గాతల జేమ్స్, మహ్మద్ సిద్ధిక్, మురళీకుమార్, అజయ్ కుమార్ ఎన్నికయ్యారు.


సమైక్యత స్ఫూర్తితో రాజ్యాంగాన్ని కాపాడాలి..



డివిఎస్.వర్మ, దారి దీపం ఎడిటర్

రాజ్యాంగాన్ని మనమే రాసుకున్నాం. దానికి మనమే యజమానులు. రాజ్యాంగం ఏం చెబుతుంది, ఏం జరుగుతుందో ఆలోచించాలి. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం రాజ్యాంగం కల్పించింది. రాజ్యాంగ విలువలు రాజ్యాంగంలో పొందుపర్చారు. దేశ ప్రధాని హిందూ జాతీయవాదిగా ప్రకటించుకున్నారు. ఇది లౌకికరాజ్యానికి విరుద్ధం. లౌకిక రాజ్యంలో వాటికి దూరంగా ఉండాలి. హిందూ జాతీయవాదం కోసం మాట్లాడుతారుగాని భారత జాతీయవాదం కోసం మాట్లాడరు. మతోన్మాద దేశంగా మార్చే ప్రయత్నాలు సాగిస్తున్నారు. గాంధీ సనాతన హిందువుగా ప్రకటించుకున్నారుగాని లౌకికరాజ్యం కోసం చెప్పారు. ప్రస్తుతం లౌకికరాజ్యంపై దాడి జరుగుతుంది. హిందూ రాజ్యాంగం కోసం ఒక ముసాయిదా తయారు చేశారు. సాధిస్తామని చెప్పారు. మనుధర్మ శాస్త్రానికి, రామ రాజ్యానికి, క్వాంటం అర్థ రాజ్యానికి ఇది పునాదిగా చెబుతున్నారు. సనాతన హిందువు అయితేనే చట్టసభలకు అర్హులు. హిందూ రాష్ట్రంలో రాజ్యాంగం ఉండదు. ప్రజాస్వామ్యం పౌర హక్కులు, రాజ్యాంగ విలువలు, హక్కులు అంతరించిపోయే ప్రమాదం ఉంది. సమైక్యతా స్ఫూర్తితో రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.


రాజ్యాంగంపై బహుముఖ దాడి..



ఉద్దరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన సీతారాం

రాజ్యాంగం అమలైతే దేశం అభివృద్ధి చెందుతుంది. ప్రస్తుతం నయా ఫాసిజం రాజ్యమేలుతుంది. మతం ముసుగులో ఫాసిజం రాజ్యమేలుతుంది. ప్రజాస్వామ్యంలోని నాలుగు స్తంభాలు కొట్టేసే విధంగా ప్రయత్నాలు సాగిస్తున్నాయి. లౌకిక విధానంపై దాడి చేస్తున్నారు. రామాలయ నిర్మాణంలో సుప్రీంకోర్టు సైతం రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరించి తీర్పునిచ్చింది. సర్వ బహుమత్వం అనేది కన్పించట్లేదు. అమెరికాకు బిజెపి లొంగిపోయింది. ట్రంప్ ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటున్నా కనీసం నోరు మెదపట్లేదు. పెట్టుబడిదారీ వ్యవస్థను పెంచి పోషిస్తున్న పరిస్థితి ఉంది. రాజ్యాంగంపై అన్ని వైపుల నుంచి బహుముఖ దాడి జరుగుతుంది. దీన్ని తిప్పికొట్టాలి.

ఓటు హక్కు కూడా నిర్ణయం వారిదే..



ప్రముఖ వైద్యులు బి.రమేష్ చంద్రబాబు

స్వతంత్ర వ్యవహరించాల్సిన సంస్థలను పాలకులు గుప్పెట్లో పెట్టుకోవడం అన్యాయం. ఎవర్ని నిజాయితీగా ఉండనీకుండా చేయడం దారుణం. చివరకు ఓటుహక్కు కూడా వారే నిర్ణయిస్తే ఎలా. ఓటిచ్చే అధికారం వీళ్లకు ఎక్కడి నుంచి వచ్చింది. రాజ్యాంగ విలువలను కాలరాస్తున్న పరిస్థితి. రాజ్యాంగం పరిరక్షణకు, అమలుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి.

మానవులంతా ఒక్కటే..



ప్రముఖ కంటి వైద్యులు డాక్టర్ హుస్సేన్

రాజ్యాంగంపై దాడి జరుగుతున్న నేపథ్యంలో స్వాతంత్ర పోరాటంలా మరో పోరాటం చేయాల్సిన అవసరం ఉంది. మతాల మధ్య చిచ్చుపెట్టి రాజకీయాలు చేస్తున్న రోజులివి. ఏ గ్రంథం చెప్పిన మానవులంతా ఒకటేనని చెబుతుంది. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి మానవులను వేరు చేయడం ఎంతవరకు సమంజసం. అంతా కలిసికట్టుగా ఉండి రాజ్యాంగం విలువలను కాపాడుకోవడంతోపాటు లౌకిక రాజ్యంపై జరుగుతున్న దాడి వ్యతిరేకించేందుకు కృషి చేయాలి.

ప్రమాదంలో ప్రజాస్వామ్యం..



సామాజిక న్యాయ పోరాట వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.మురళి

ప్రతిఒక్కరూ రాజ్యాంగాన్ని గౌరవించి దానికి అనుకూలంగా నడుచుకోవాలి. మన విలువలు రాజ్యాంగంతో ముడిపడి ఉన్నాయి. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉంది. దీన్ని పరిరక్షించుకునేందుకు కలిసికట్టుగా ముందుకు సాగాలి.

ప్రభుత్వం విధానాలు మార్చుకోవాలి..



జెవివి నాయకులు ఎర్ర అజయ్‌కుమార్

ప్రభుత్వం అన్ని రంగాల్లో అనేక మార్పులు తీసుకొస్తోంది. ముఖ్యంగా ప్రభుత్వ రంగాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. విద్యలో అనేక మార్పులు తీసుకొచ్చి పాఠ్యాంశాలు సైతం మార్చేస్తుంది. ఇది సరైంది కాదు. ముఖ్యంగా పిపిపి పద్ధతిని తీసుకొచ్చి వైద్య కళాశాలలను ప్రయివేటుపరం చేయడం అన్యాయం. మతోన్మాదాన్ని పెంచి పోషించేలా బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నాలు చేస్తున్నాయి. జిల్లాలో కాలుష్యం రాజ్యమేలుతుంది. కేన్సర్ రోగులు రోజురోజుకీ పెరుగుతున్నారు. సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టి పరిష్కరించాలి.



హాజరైన జనం, ఉద్యోగులు, కార్మికులు

నేటి నుంచి విద్యుత్ కార్మికుల సమ్మె

జయప్రదం చేయాలి : యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్లు

సంపూర్ణ మద్దతు ప్రకటించిన సిఐటియు

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 15వ తేదీ బుధవారం నుండి విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు, అవుట్సోర్సింగ్ ఉద్యోగులు, పర్మినెంట్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ ఉద్యోగ, కార్మికులు సమ్మెలోకి వెళ్లనున్నారు. ఎపి స్ట్రగుల్ కమిటీ నాయకత్వంలో సమ్మెను జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ విజ్ఞప్తి చేశాయి. స్థానిక సిఐటియు కార్యాలయంలో భీమవరం డివిజన్ అధ్యక్షుడు విప్పర్తి బోసు అధ్యక్షతన మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డిస్కం అధ్యక్షులు జె.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.సురేష్ మాట్లాడుతూ కూటమి ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయడంలో విఫలమైందన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం ఇస్తామని మాటలు చెప్పడమేగానీ ఇంతవరకు ఆచరణకు నోచుకోలేదన్నారు. తెలంగాణలోలా సంస్థలో విలీనం చేసి రూ.46 వేలు జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2022 పిఆర్‌సి ఎరియర్స్ ఇంతవరకు చెల్లించలేదన్నారు. డిఎ బకాయిలు ఉన్నాయని తెలిపారు. విద్యుత్ రంగ ప్రయివేటీకరణను నిలుపుదల చేయాలన్నారు. అధికారుల చర్చలకు స్ట్రగుల్ కమిటీ నాయకత్వాన్ని పిలవకుండా సంఘాల మధ్య తుంపర్లు పెట్టే చర్యలు మానుకోవాలని, సమ్మె నోటీస్ ఇచ్చిన అన్ని సంఘాలను చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు పాండురంగరాజు, శ్రీనివాసరాజు, జానకిరామ్, పవన్ కళ్యాణ్, పజులుద్దీన్, అమిత్, ప్రశాంత్, సుత్తేజ్ పాల్గొన్నారు.

భీమవరం టౌన్: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు, ఉద్యోగుల సమ్మెకు సిఐటియు జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ కమిటీ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఎన్‌వి.గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్ ఒక ప్రకటన విడుదల చేశారు. పవర్ జెఎసి స్ట్రగుల్ కమిటీలు ఇచ్చిన సమ్మె నోటీసుకు పూర్తి మద్దతు తెలిపారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు కొనసాగే సమ్మెకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యుత్ కార్మికుల, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని, దీర్ఘకాలిక సమస్యలన్నిటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. తాము కూడా సమ్మెలో ప్రత్యక్షంగా పాల్గొని మద్దతిస్తామని వారు పేర్కొన్నారు.

యాత్రికులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - పాలకొల్లు

కార్తీక మాసంలో ఆలయానికి వచ్చే యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. మంగళవారం స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి దేవస్థాన అధికారులు, ధర్మకర్తల మండలి ఛైర్మన్, సభ్యులతో కార్తీక మాస ఏర్పాట్లపై ఆలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ పంచారామాల్లో ప్రసిద్ధిగాంచిన క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా అపరిశుభ్రత అనే మాట లేకుండా పరిశుభ్రమైన వాతావరణం నెలకొల్పేలా చేయాలన్నారు. స్వచ్ఛమైన తాగునీరు అందించాలన్నారు. చలువ పందిర్లు, షామియానా ఏర్పాటుతోపాటు ఆలయంకు, రాజగోపురానికి ప్రత్యేక విద్యుత్ అలంకరణ, పువ్వుల అలంకరణలు ప్రత్యేక శ్రద్ధతో చేయాలని సూచించారు. క్యూలైన్లను పక్కాగా ఏర్పాటు చేయడంతోపాటు చిన్నపిల్లలకు పాలు కూడా ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైతే అదనపు పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. తొలుత కలెక్టర్‌కు ఆలయ ఇఒ, ధర్మకర్తల మండలి ఛైర్మన్ స్వాగతం పలికారు. ప్రధాన అర్చకులు కిష్టప్ప, అనిల్ కలెక్టర్‌కు తీర్థ, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో నరసాపురం ఆర్‌డిఒ దాసి రాజు, జిల్లా దేవాదాయ శాఖాధికారి వి.హరిసూర్యప్రకాష్, దేవస్థానం ఇఒ ముచ్చర్ల శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి ఛైర్మన్ మీసాల రామచంద్రరావు, మున్సిపల్ కమిషనర్ విజయసారథి, దేవాలయాల తనిఖీ అధికారి వి.వెంకటేశ్వరరావు, తహశీల్దార్ వై.దుర్గాకిషోర్, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అధికారులు,

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

నూతన ఉపాధ్యాయులకు యుటిఎఫ్ స్వాగతం

ప్రజాశక్తి - కాళ్ల

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కొత్త ఉపాధ్యాయులు కృషి చేయాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. మంగళవారం మండలంలో విధుల్లో చేరిన 30 మంది కొత్త ఉపాధ్యాయులకు, అంతర్ జిల్లా బదిలీల ద్వారా మండలంలో చేరిన ఉపాధ్యా యులను యుటిఎఫ్ నేతలు కలిసి యుటిఎఫ్ డైరీ, సిఎల్ బుక్ తదితర సామగ్రి అందించి స్వాగతం పలికారు. ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకునేందుకు యుటిఎఫ్ చేసే పోరాటానికి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు సిహెచ్.పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణరాజు, మండలాధ్యక్షులు బిఆర్‌ఎం.కోటేశ్వరస్వామి, నాయకులు పి.ఆరోగ్యం, కె.రవిచంద్రకుమార్, బి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ ఇవ్వాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఆచంట



నినదిస్తున్న కౌలురైతులు, కార్మికులు

భూయజమానుల సంత కంతో సంబంధం లేకుండా కౌలు గుర్తింపు కార్డులు తక్షణమే ఇవ్వాలని ఎపి కౌలురైతుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఉందుర్తి శ్రీనివాసరావు, మామిడిశెట్టి రామాంజనేయులు అన్నారు. పంట నమోదు కౌలురైతుల పేరున చేసి, దాని ఆధారంగా పెట్టుబడి సాయం వెంటనే ఇవ్వాలని, రిజర్వుబ్యాంక్ నిబంధనల ప్రకారం ప్రతి కౌలురైతుకూ రూ.2 లక్షల పంట రుణం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు, రామాంజనేయులు మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ సాగు 80 శాతం కౌలు రైతులే చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన కౌలుచట్టం ప్రకారం ఒప్పంద పత్రంపై భూయజమానులు సంతకం పెట్టేందుకు అంగీకరించడం లేదన్నారు. దీంతో గుర్తింపు కార్డులు రాక కౌలురైతులకు ప్రభుత్వ రాయితీలు అందక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. తాము అధికారంలోకి వస్తే జగన్ తెచ్చిన చట్టాన్ని రద్దుచేసి కొత్త కౌలు చట్టాన్ని తెస్తామని కూటమి హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలన్నారు. కౌలురైతుల సమస్యలు వెంటనే జిల్లా అధికారులు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని తహశీల్దార్ కనకరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, కౌలురైతులు కేతా పూర్ణారావు, కొండేటి సత్యనారాయణ, పుచ్చకాయల నాగరాజు, పి.మోహన్, గుడిపూడి వెంకటేశ్వరరావు, వి.బాలరాజు, గెద్దాడ శ్రీనివాస్, మామిడిశెట్టి సురేష్, మట్టా చంటి, ఎ.సత్యనారాయణ, దొడ్డా సుబ్బారావు పాల్గొన్నారు.

ట్యాంకర్, మోటారు సైకిల్ ఢీ

ఒకరు మృతి, మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు మండలం దిగమర్రు వద్ద మంగళవారం సాయంత్రం మోటారు సైకిల్, ఆయిల్ ట్యాంకర్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసుల కథనం ప్రకారం చెందిన తణుకుకు చెందిన కొల్లి మహేష్ రాజు (18), కూచి చరణ్‌శర్మ (18), సాయి చరణ్ (18) మోటారు సైకిల్‌పై పేరుపాలెం వెళుండగా దిగమర్రు వద్దకు వచ్చేసరికి ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో మహేష్‌రాజు అక్కడికక్కడే మృతి చెందారు. పాలకొల్లు రూరల్ సిఐ గుత్తుల శ్రీనివాస్ సారథ్యంలో రూరల్ ఎస్ఐ దర్యాప్తు చేస్తున్నారు.

బిల్లుల్లేవు.. జిఎస్‌టి లేదు..!

- మందులపై జిఎస్‌టి తగ్గింపు అమలు శూన్యం
- ఉమ్మడి పశ్చిమలో మూడు వేల వరకూ మెడికల్ స్టోర్లు
- కొనుగోలుదార్లకు ఎక్కడా బిల్లులే ఇవ్వని పరిస్థితి
- 18,12 శాతం జిఎస్‌టి ఐదు శాతానికి తగ్గింపు
- రెండు జిల్లాల్లో ఎక్కడా అమలు కాని పరిస్థితి
- స్టోర్ల ముందు జిఎస్‌టి తగ్గింపు బోర్డులు ఏర్పాటు చేస్తే మేలు

'సూపర్ జిఎస్‌టి.. సూపర్ సేవింగ్స్' పేరుతో ప్రభుత్వం చేస్తున్న హడావుడికి, క్షేత్రస్థాయి పరిస్థితికి సంబంధం లేకుండాపోయింది. ముఖ్యంగా కేన్సర్‌తోపాటు అరుదైన వ్యాధులకు సంబంధించిన మెడికల్స్ (ఔషధాలు)పై, ఇతర మెడికల్స్‌పై తగ్గిన జిఎస్‌టి ఫలాలు ప్రజలకు ఏమాత్రం అందడం లేదు. ఏఒక్క మెడికల్ స్టోర్‌లోనూ జిఎస్‌టి తగ్గించి మెడిసిన్స్ అమ్మడం లేదు. రోగులు కొనుగోలు చేస్తున్న మెడిసిన్స్‌కు బిల్లులే ఇవ్వని పరిస్థితి ఉంది. బిల్లులు ఇవ్వకుండా జిఎస్‌టి తగ్గిందో, లేదో జనాలకు తెలిసే అవకాశం లేకుండాపోయింది. దీనిపై అధికారుల చర్యలు సైతం తూతూమంత్రంగా అన్నట్లు ఉన్నాయనే విమర్శలు విన్పిస్తున్నాయి.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మూడు వేల వరకూ మెడికల్ స్టోర్‌లు ఉన్నాయి. మెడికల్ స్టోర్స్‌లో ప్రతిరోజూ రూ.లక్షల్లో వ్యాపారం సాగుతోంది. జిఎస్‌టి 2.0 పేరుతో కేంద్ర ప్రభుత్వం కేన్సర్‌తోపాటు అరుదైన రోగాలకు సంబంధించిన మెడిసిన్స్‌పై జిఎస్‌టిని ఎత్తివేసింది. 12, 18 శాతం శ్లాబులు ఉన్న మెడికల్స్‌పై ఐదు శాతానికి తగ్గించింది. జిఎస్‌టి తగ్గింపు ఫలాలు మాత్రం జనాలకు అందడం లేదు. మందుల దుకాణాల్లో సాగుతున్న నిరంకుశ పోకడలే అందుకు ప్రధాన కారణం. ప్రభుత్వ నిబంధనలేవీ మెడికల్ స్టోర్స్‌లో పాటించడం లేదు. వైద్యులు సూచించిన చీటీ ప్రకారం మెడిసిన్స్ ఇవ్వాల్సి ఉన్నప్పటికీ ఇష్టానుసారంగా వీరే రోగులకు మందులు ఇస్తున్న విషయం బహిరంగ రహస్యమే. రోగులు కొనుగోలు చేసిన మెడిసిన్స్‌కు మెడికల్ స్టోర్స్‌లో బిల్లు అనేది ఎక్కడా ఇవ్వడం లేదు. ఒకవేళ ఎవరైనా బిల్లు అడిగితే పెద్ద దాడే జరుగుతోంది. డ్రగ్ కంట్రోల్ అధికారులకు ఇవన్నీ తెలిసినా మామూళ్ల మత్తులో పడి పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ప్రస్తుతం రెండు జిల్లాల్లో వేల సంఖ్యలో కేన్సర్ రోగులు ఉన్నట్లు ప్రభుత్వం నిర్వహించిన స్క్రీనింగ్ టెస్టుల్లో తేలింది. అరుదైన వ్యాధులతో బాధపడుతున్నవారు పెద్దసంఖ్యలో ఉన్నారు. కేన్సర్ రోగులకు సంబంధించిన మెడికల్స్‌కు జీరో జిఎస్‌టి ఉన్నా ఎక్కడా అమలు కావడం లేదని రోగుల కుటుంబ సభ్యులు చెబుతున్నారు. కొనుగోలు చేసిన మెడిసిన్స్‌కు బిల్లులే ఇవ్వకపోతే జిఎస్‌టి తగ్గిందో, లేదో ఏవిధంగా తెలుస్తుందని వారంతా ప్రశ్నిస్తున్నారు. రెండు రోజుల క్రితం డ్రగ్ కంట్రోల్ అధికారులు చింతలపూడి, ఏలూరులోని మెడికల్ స్టోర్స్‌లో తనిఖీలు నిర్వహించారు. చింతలపూడిలో ఎనిమిది, ఏలూరులో ఒక మందుల దుకాణంలో జిఎస్‌టి తగ్గింపు లేకుండా మెడికల్స్ విక్రయించినట్లు గుర్తించి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మూడు వేల దుకాణాలు ఉన్నాయి. మిగిలిన దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తే జిఎస్‌టి దందా మరింత స్పష్టంగా బయటపడుతుంది. మెడికల్ స్టోర్స్‌పై అధికారుల దాడులు తూతూమంత్రంగానే సాగుతున్నాయనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఏలూరులో మెడ్‌ప్లస్ వంటి కొన్ని మెడికల్ స్టోర్స్‌లో తప్ప ఫైర్ స్టేషన్‌లో ఉన్న ప్రధాన మెడికల్ దుకాణాల్లో ఎక్కడా బిల్లులు ఇవ్వడం లేదు. జిఎస్‌టి తగ్గించని పరిస్థితీ కన్పించడం లేదు. దీంతో జిఎస్‌టి తగ్గినా జనానికి ఎటువంటి మేలూ జరగడం లేదు. జిఎస్‌టి తగ్గింపుపై చేస్తున్న హడావుడి తగ్గించి అమలుకు సంబంధించి చర్యలు చేపడితే జనానికి మేలు జరుగుతుందని చెప్పొచ్చు.

మెడికల్ స్టోర్ ముందు బోర్డులు పెడితే కొంత మేలు

ప్రతి మెడికల్ స్టోర్ ముందు ఏ మెడిసిన్స్‌కు సంబంధించి జిఎస్‌టి తగ్గిందో బోర్డులు ఏర్పాటు చేసినప్పుడే జనాలు ప్రశ్నించే అవకాశం ఉంటుంది. మెడికల్‌స్టోర్స్ ముందు బోర్డులు పెట్టేవిధంగా అధికారులు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో అర్థం కావడం లేదు. మెడికల్ స్టోర్స్‌కు వెళ్లేవారికి అవగాహన కలగాలంటే బోర్డులు ఏర్పాటు తప్పనిసరి. అప్పుడే మెడికల్ స్టోర్స్ యజమానులకు సైతం భయం ఉంటుంది. మెడికల్ స్టోర్స్ యాజమాన్యాలకు, సంబంధిత శాఖాధికారులకు మధ్య ఎప్పటి నుంచో అవగాహన నడుస్తుందనే ఆరోపణలు ఉన్నాయి. ఆ కారణంగానే మెడికల్ స్టోర్స్‌లో నిబంధనలు అమలు చేయకపోయినా పట్టించుకోని పరిస్థితి కొనసాగుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. జిఎస్‌టి తగ్గింపుపై సైతం ఒకటి, రెండురోజులు తూతూమంత్రపు తనిఖీలు చేసి వదిలేస్తారు. తర్వాత షరా మామూలు అన్నట్లు పరిస్థితి తయారవుతుందనడంలో ఎటువంటి సందేహమూ అక్కర్లేదు.

బిల్లులు లేకుండా ఆడిట్ ఎలా?

ఏ వ్యాపార సంస్థ అయినా తన అమ్మకాలపై ప్రతియేటా ఆడిట్ చేయించుకోవాల్సి ఉంటుంది. విక్రయించిన ప్రతిదానికి సంబంధించి బిల్లులు ఆడిట్‌లో చూపించాల్సి ఉంటుంది. మందుల విక్రయాలకు సంబంధించి బిల్లులే ఇవ్వడం లేదు. అటువంటప్పుడు ప్రతియేటా ఆడిట్ ప్రక్రియ ఏవిధంగా నిర్వహిస్తున్నారో తేలాల్సి ఉంది. తప్పుడు పద్ధతుల్లోనే ఆడిట్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఆడిట్ వ్యవహారాలపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



అనంతపురంలో జరుగుతున్న ఐద్వా రాష్ట్ర మహాసభలో పాల్గొన్న జిల్లా ప్రతినిధులు

నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం

వైసిపి ఆధ్వర్యాన జిల్లాలో ర్యాలీలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

సామాన్యుని ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ మద్యంపై సిబిఐ విచారణ జరిపించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వైసిపి క్యాంపు కార్యాలయం నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి డిటి అనురాధకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా అసలు, నకిలీకి తేడా లేకుండా రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యపానం స్కామ్ స్కీమ్‌కు తెరలేపారన్నారు. రాష్ట్రంలో నకిలీ మద్యం కేంద్రాలు నడుపుతూ వేల కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారన్నారు. మామూళ్ల మత్తులో మునిగిపోయిన ఎక్సైజ్ అధికారులు వెంటనే స్పందించి బెల్టు షాపులు తనిఖీలు చేయాలన్నారు. పోలీస్ అధికారులు కూడా బాధ్యతగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఆచంట: రాష్ట్రంలో నకిలీ మద్యం తయారీ, సరఫరా ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతోందని వైసిపి మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆందోళన వ్యక్తం చేశారు. నకిలీ మద్యం అరికట్టాలని, వెంటనే సిబిఐతో దర్యాప్తు చేపట్టాలని కోరుతూ మంగళవారం ఆచంట కచేరీ సెంటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ఇప్పటి వరకూ 421 మంది నకిలీ మద్యం వల్ల ప్రాణాలు కోల్పోయారని వార్తలు చెబుతున్నాయన్నారు. వైసిపి ప్రభుత్వంలో పారదర్శకంగా లిక్కర్ విధానం అమలైందని, ప్రభుత్వం స్వయంగా మద్యం దుకాణాలు నడపడం వల్ల నియంత్రణ సాధ్యమైందని వివరించారు. కూటమి ప్రభుత్వం రాగానే ఈ విధానాలు రద్దు చేసి, ప్రయివేటు వారికి వైన్ షాపులు కేటాయించడం, పర్మినెంట్ రూములకు అనుమతులు ఇవ్వడం, బెల్టు షాపులు మళ్లీ తెరవడం జరిగిందని విమర్శించారు. ఈ వ్యవహారంలో ఉన్న వాస్తవాలు బహిర్గతం కావడానికి సిబిఐ దర్యాప్తు అవసరమని వైసిపి డిమాండ్ చేస్తోందని చెప్పారు. నరసాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని వైన్ షాపులు, పర్మినెంట్ రూములు, బార్లు, బెల్టు షాపులపై ఎక్సైజ్ శాఖ విస్తృతంగా తనిఖీలు జరపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్లు, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, సర్పంచులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేత

ప్రజాశక్తి - పెనుమంట్ర

అన్ని సౌక ర్యాలతో ఉచితంగా నాణ్యమైన విద్య అందించే ప్రభుత్వ పాఠశాలలకు అందరూ ప్రోత్సాహం ఇవ్వాలని ఎంఇఒ-2 ఉంగరాల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఊరి చెరువు వద్ద ఉన్న మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాలలో స్థానిక దాత జవ్వాది నాగేశ్వరరావు వారి తల్లి ధనలక్ష్మి పేరిట 60 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం స్టీల్ కంచాలు, గ్లాసులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యర్రా రాధేగోపాల్, ప్రధానోపాధ్యాయులు మహంకాళి, ఉపాధ్యాయులు ఎవి.సూర్య కృష్ణకిరణ్ పాల్గొన్నారు.

అన్న సమారాధనకు సాయం

కాళ్ల:దేవీ నవ రాత్రుల సందర్భంగా దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ దాట్ల వెంకటరామరాజు అన్న సమారాధనకు సాయం అందించడం అభినం దనీయమని ట్రస్ట్ సభ్యులు పెన్మెత్స నాగరాజు మంగళవారం తెలిపారు. కాళ్లకూరులో పూజార్ల వంతెన వద్ద దేవీ నవరాత్రుల సందర్భంగా అన్న సమారాధనకు దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ దాట్ల వెంకటరామరాజు ముందుకొచ్చి 6 బస్తాల బియ్యం, 10 లీటర్ల పెరుగు బకెట్లు, 500 లీటర్ల ఆర్‌ఒ వాటర్ అందజేశారని ఆయన తెలిపారు.

టెండర్లపై అత్యవసర సమావేశం

నరసాపురం:మండలంలోని మల్లవరం గ్రామంలో టెండర్లకు సంబంధించి మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. సర్పంచి సంది సుజాత అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఇఒపిఆర్‌డి కె.నాగేంద్రకుమార్‌తో పాటు పాలకమండలి సభ్యులు హాజరయ్యారు. పంచాయతీలో అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో ఏడాది పాటు పని చేసేందుకు ప్లాట్ మిత్ర గ్రీన్ అంబాసిడర్, పంపు ఆపరేటర్ సంబంధించి టెండర్లను ఆహ్వానించారు. ఈ పోస్టులకు ఏడుగురు టెండర్లు వేశారు. అయితే టెండర్లలో తెరిచేందుకు సర్పంచి నిరాకరించారు. దీంతో టెండర్ల ప్రక్రియకు బ్రేక్ పడింది. సమావేశంలో జరిగిన పరిణామాలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఇఒపిఆర్‌డి నాగేంద్రకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి పి.శేషు, ఎంపిటిసి మేరీరత్నం, కార్యదర్శి కళ్యాణి, సభ్యులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి

మొగల్తూరు:తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని డిఎల్‌పిఒ జ్యోతిర్మయి సూచించారు. మండలంలోని రామన్నపాలెం గ్రామంలో మంగళవారం మొగల్తూరు, యలమంచిలి, నరసాపురం క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్‌కు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జ్యోతిర్మయి మాట్లాడారు. తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించి వేర్వేరుగా ఇచ్చేలా అవగాహన కల్పించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఎడ్వర్డ్ డిప్యూటీ ఎంపిడిఒలు మేడిది నవీన్ కిరణ్, నాగేంద్ర కుమార్ ఉన్నారు.

అదృశ్యమైన బాలిక తల్లిదండ్రులకు అప్పగింత

మొగల్తూరు:మొగల్తూరులో అదృశ్యమైన బాలికను పోలీసులు ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించారు. చదువు విషయంలో తల్లిదండ్రులు ఆమె కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురై ఇంటి నుంచి బయటకెళ్లింది. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు ఎస్‌పి అద్నాన్ నయీమ్ అస్మి ఆదేశాల మేరకు డిఎస్‌పి రేవతి ఆధ్వర్యంలో సిఐ జి.దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో ఎస్ఐ వాసు దర్యాప్తు చేపట్టారు. ఏర్పడిన బృందం బాలిక ఆచూకీ కోసం గాలించారు. ఆ బాలిక ఇంటి సమీపంలోనే ఉండడాన్ని గుర్తించి సిఐ దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసును ఛేదించిన మైనర్ బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించిన సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.

17 మంది ఉపాధ్యాయులు చేరిక

పెనుమంట్ర:మెగా డిఎస్‌సిలో ఎంపికైన కొత్త ఉపాధ్యాయులు 17 మంది స్కూల్ అసిస్టెంట్లు మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూళ్లలో విధుల్లో చేరినట్లు ఎంఇఒలు వై.వెంకటేశ్వరరావు, మంగరాజు తెలిపారు.

సమ్మెకు మద్దతుగా వైద్య సిబ్బంది ధర్నా

పెనుమంట్ర:ప్రభుత్వ వైద్య అధికారులు ఒపి సేవలు బహిష్కరణకు మద్దతుగా స్థానిక వైద్య ఉద్యోగులు సంఘీభావం తెలుపుతూ పెనుమంట్ర పిహెచ్‌సి వద్ద ధర్నా నిర్వహించారు. మంగళవారం మధ్యాహ్నం పెనుమంట్ర పిహెచ్‌సిలో గత సంవత్సరం ఉన్నతాధికారులు ఇచ్చిన హామీ ఒక్కటి కూడా నేటికీ అమలుకు నోచుకోలేదని, ఈ నేపథ్యంలో చేపట్టిన నిరసనలో భాగంగా నేటి నుంచి అవుట్ పేషెంట్ సేవలను నిలిపివేస్తున్నట్లు వైద్యులు తెలిపారు. టైం బాండ్ ప్రమోషన్ అమలు చేయాలని, ఇన్ సర్వీస్ పిజి కోటాను పునరుద్ధరించాలని, నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు 50 శాతం మూల వేతనాన్ని, గిరిజన భత్యం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిహెచ్‌సి కె.రమణ, ఎస్.మల్లేశ్వరరావు, ఆర్‌విఎస్ఎన్.మూర్తి, కుమారి, కె.భాగ్య కుమారి, సిహెచ్ మంగతాయారు, ముఖేష్, రేవంత్, సెక్యూరిటీ బాబు, నాగభూషణం పాల్గొన్నారు.

పోలమూరు డ్రెయిన్‌ను ప్రక్షాళన చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - వీరవాసరం

నవుడూరు సెంటర్ నుంచి వీరవాసరం బస్‌రాజు కోడులో కలిసే పోలమూరు మురుగు డ్రెయిన్ తక్షణం ప్రక్షాళన చేసి వేల ఎకరాల వరి పొలాలను ముంపు బారి నుంచి కాపాడాలని నవుడూరు సిపిఎం శాఖ కార్యదర్శి అయినంపూడి బాబూరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామ శాఖ సమావేశం మైగాపుల త్రిమూర్తులు అధ్యక్షతన యర్ర బండి నారాయణమూర్తి ఇంటి వద్ద జరిగింది. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా పోలమూరు డ్రెయిన్ గురించి కన్నెత్తి చూసినవారే లేరని, పాలకులు పట్టించుకోలేదని, సంబంధిత అధికారులు కన్నెత్తి చూడలేదని తెలిపారు. నీటి సంఘాల వారికి పట్టదని ఆయన విమర్శించారు. తక్షణం సంబంధిత అధికారులు స్పందించి పోలమూరు డ్రెయిన్ ప్రక్షాళన చేసి రైతాంగం మునిగిపోకుండా కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఎం గ్రామ కమిటీ సభ్యులు తాళ్లూరి రాము మాట్లాడుతూ నవుడూరు నుంచి వెంప్ర వెళ్లే ఆర్‌అండ్‌బి రోడ్డు తక్షణం వేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని ఆయన కోరారు. ప్రస్తుతం ఈ రోడ్డు పెద్ద పెద్ద గోతులతో చెరువులను తలపిస్తుందని, దీంతో ప్రతిరోజూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. వెంటనే సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పర్యటించి సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

పాఠశాలకు ఫ్యాన్లు అందజేత

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక జివిఎస్‌విఆర్ మున్సిపల్ మోడల్ ప్రైమరీ స్కూల్‌కు తిల్లపూడికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త కామిశెట్టి అయ్యప్పనాయుడు పెడస్టల్ ఫ్యాన్, సీలింగ్ ఫ్యాన్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు భవానీ ప్రసాద్ రాయపూడి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏదోక రూపంలో తమ స్కూలు విద్యార్థులకు ఉపయోగపడే వస్తువులు అందజేస్తున్న అయ్యప్పనాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జి.వెంకటేశ్వర్లు, మధుసూదనరెడ్డి, లీలాకుమారి, సరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట మీద నిలబడే మిత్రుడు పుస్తకం

- ❑ పుస్తక పఠనం అభివృద్ధికి, సమాజ మార్పునకు దోహదం
- ❑ రాష్ట్రానికి గ్రంథాలయం లేకపోవడం బాధాకరం
- ❑ రాష్ట్రవ్యాప్తంగా ప్రజాశక్తి బుక్‌హౌస్‌ల ఏర్పాటుకు సన్నాహాలు
- ❑ ఏడాదిపాటు స్వర్ణోత్సవ సంబరాలు
- ❑ కెజి బుక్‌హౌస్ ప్రారంభోత్సవంతో పూర్వ ఎంఎల్‌సి ఎంవిఎస్.శర్మ
- ❑ భీమవరంలో బుక్‌హౌస్ ఏర్పాటు అభినందనీయం
- ❑ ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి



మాట్లాడుతున్న ఎంవిఎస్,.శర్మ



మాట్లాడుతున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

గత తరాల ఆలోచనలు తెలుసుకోవడానికి ఈ తరానికి పుస్తకం ఎంతో దోహదపడుతుందని, మాటమీద నిలబడే మిత్రుడు పుస్తకమని మాజీ ఎంఎల్‌సి, ప్రజాశక్తి బుక్‌హౌస్ ఎడిటర్ ఎంవిఎస్.శర్మ అన్నారు. పుస్తక పఠనం నూతన తర అభివృద్ధికి, సమాజ మార్పునకు దోహదపడుతుందన్నారు. సాహితీ చర్చలు, కళారూపాలకు సాంస్కృతిక వేదికగా బుక్‌హౌస్‌లు ఉండాలని సూచించారు. స్థానిక మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు (కెజి) బుక్‌హౌస్‌ను పూర్వ ఎంఎల్‌సి ఎంవిఎస్.శర్మ, ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి మంగళవారం ప్రారంభించారు. తొలుత కందుకూరి, గురజాడ చిత్రపటాలకు ఎంవిఎస్.శర్మ, ఉద్దరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన సీతారాం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు బుక్‌హౌస్ కన్వీనర్ జి.రామలింగరాజు (మాస్టారు) అధ్యక్షత వహించారు. అనంతరం శర్మ మాట్లాడుతూ నూతన ప్రపంచంలో పుస్తక అధ్యయనం ప్రాముఖ్యత ఎంతో ఉందన్నారు. పుస్తక పఠనం నూతనతర అభివృద్ధికి, సమాజ మార్పునకు దోహదం చేస్తుందన్నారు. మానవత్వ విలువలను ప్రతిబింబించేదే సాహిత్యమని, దానిని బతికించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బుక్‌హౌస్ నెలకొల్పడం మంచి విషయమే అయినా ప్రతి పుస్తకంపై చర్చలు జరిగేలా ఈ బుక్‌హౌస్ ఉండాలన్నారు. సాహితీ చర్చలు, కళారూపాలకు సాంస్కృతిక వేదికగా ఇకపై బుక్‌హౌస్‌లు ఉండాలని ఆకాంక్షించారు. జాతీయ ఉద్యమంలో గ్రామగ్రామాన గ్రంథాలయాలు నడిచాయని గుర్తు చేశారు. అయితే రాష్ట్రానికి గ్రంథాలయం లేకపోవడం బాధాకరమైన విషయమన్నారు. 1977 ఆగస్టు ఒకటో తేదీన ప్రజాశక్తి బుక్‌హౌస్‌ను ప్రారంభించిందని చెప్పారు. 2026 ఆగస్టు ఒకటో తేదీకి 50 ఏళ్లు పూర్తి చేసుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఏడాదిపాటు స్వర్ణోత్సవ సంబరాల సభలు నిర్వహించనున్నామని తెలిపారు. నెల్లూరు, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం ప్రాంతాల్లో ప్రజాశక్తి బుక్‌హౌస్‌లు ఉన్నాయని, రాష్ట్రవ్యాప్తంగా వీటిని విస్తరిస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సాహిత్య సాంస్కృతిక సంబరాలు నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌హెచ్ టౌన్‌హాలు సెక్రటరీ బేతు కృష్ణారావు, ఇందుకూరి ప్రసాదరాజు, సిఎస్ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సత్యనారాయణ, తిరుమల విద్యాసంస్థల డైరెక్టర్లు సాగిరాజు సాయిరాజు, సాగిరాజు శ్రీనివాస్‌వర్మ, ఎస్ఆర్ ఇనిస్టిట్యూట్ జోనల్ మేనేజర్ దేవేంద్ర, డిఎన్ఆర్ విద్యాసంస్థల పూర్వ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జుత్తిగ చంద్రప్రసాద్, రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గాతల జేమ్స్, మంతెన రామలింగరాజు, కాంతమ్మ ట్రస్ట్ అధినేత చేకూరి ఝాన్సీలక్ష్మి, మానవత అధ్యక్షులు చింతలపాటి రామకృష్ణరాజు, ప్రముఖ జలవనరుల నిపుణులు ప్రొఫెసర్ పిఎఆర్‌కె.రాజు, మేజర్ డాక్టర్ ఎ.వీరయ్య, బిఎస్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోనా జోసెఫ్, వ్యాపారవేత్త బొండా శ్రీరామమూర్తి, నేషనలిస్ట్ జనశక్తి పార్టీ అధ్యక్షులు కడియం సూరిబాబు, సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ పాల్గొన్నారు.

భీమవరంలో బుక్‌హౌస్ ఏర్పాటు అభినందనీయం

ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి

భీమవరం వంటి ప్రాంతంలో ఇప్పటి వరకు ఇలాంటి బుక్‌హౌస్ లేదు. ఇప్పుడు మహా గొప్ప రచయితల పేర్లతో భీమవరం పట్టణంలోనే బుక్‌హౌస్ నెలకొల్పడం అభినందనీయం. డబ్బుల్లేక పుస్తకం కొనుక్కోలేని పరిస్థితి నుంచి ఖాళీ ఉంటే ఫోన్ చూస్తే రోజులు వచ్చాయని, పుస్తక అధ్యయనం తగ్గడం సమాజ అభివృద్ధికి తీవ్ర ఆటంకమని అన్నారు. గతంలో ఇదే భీమవరంలో అనేక గ్రంథాలయాలు ఉండేవన్నారు. నేడు పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా అధ్యయనం పెరగాలన్నారు.

డిజిటల్ యుగం పుస్తక యుగాన్ని మార్చలేదు

ఉద్దరాజు రామం మెమోరియల్ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన సీతారాం



బుక్‌హౌస్‌కు కందుకూరి, గురజాడ పేర్లు పెట్టడం అభినందనీయం. కందుకూరి అనేక సంఘ సంస్కరణల కోసం ఉద్యమిస్తూ సుమారు 135 గ్రంథాలు రాశారు. గురజాడ అప్పారావు మొదటి తెలుగు నాటకం రాసిన తెలుగు సాహితీవేత్తగా పేరొందారు. వీరిద్దరూ సమాజానికి ఎనలేని సేవ చేశారు. డిజిటల్ యుగం ఎంత పెరిగినా పుస్తకాల యుగాన్ని మార్చలేదు.

సమాజాభివృద్ధికి బుక్‌హౌస్ దోహదం

అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ ఛైర్మన్ బి.బలరాం

సమాజాభివృద్ధికి బుక్‌హౌస్ దోహదం చేస్తుంది. పుస్తకాలు చదవడం వల్లే జ్ఞానం పెరుగుతుంది. పుస్తక పఠనం ద్వారానే ఎంతోమంది మేధావులుగా తయారయ్యారు. మెరుగైన సమాజానికి ఈ బుక్‌హౌస్ దోహదపడుతుంది. భవిష్యత్ లో ప్రతీ ఒక్కరికీ చేరువయ్యేలా పుస్తకాలను అందించేలా ఈ బుక్ హౌస్ ఉపయోగపడాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఎటువంటి లాభాపేక్ష లేకుండా నిర్వహణ

బుక్‌హౌస్ కన్వీనర్ రామలింగరాజు



భీమవరం వంటి ప్రాంతంలో పదేళ్ల క్రితమే బుక్‌హౌస్ ప్రారంభించాల్సి ఉంది. ఆలస్యమైనప్పటికీ మంచి బుక్‌హౌస్‌ను ప్రారంభించాం. ఎటువంటి లాభాపేక్ష లేకుండా నిర్వహిస్తాం. ప్రతి ఇంటికీ పుస్తకం వెళ్లాలన్నదే ధ్యేయం. దాతల సహకారానికి కొదవలేదు. పుస్తకాల కొనుగోలుకు దాతల సహకారం అవసరం. సమాజం బాగుపడాలంటే పుస్తకం చదవాలి. మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, యువత అందరికీ ఉపయోగపడే మంచి పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. అతి తక్కువ ధరకే అందిస్తున్నాం.

చదువుకోవాలనే ఆసక్తి పెంచాలి


డిఎన్ఆర్ విద్యాసంస్థల మాజీ ప్రిన్సిపల్ జుత్తిగ చంద్రప్రసాద్



పుస్తకాలకు లోటు లేదు. చదువుకునే ఆసక్తి కొరవడుతోంది. పుస్తకాలను చదవాలనే ఆలోచన పెంపొందించాలి. ఇది విద్యార్థి దశలోనే జరగాలి. పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులు పుస్తకాలు చదివేలా ప్రోత్సహించాలి. పుస్తక పఠనం ద్వారానే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని అవగాహన కల్పించాలి.

పుస్తకాలు చదవడం చిన్ననాటి నుంచి అలవాటు

పుస్తక ప్రియులు, రచయిత పిఆర్‌కె.వర్మ



నాకు చిన్ననాటి నుంచి పుస్తకాలు చదవడం అలవాటు. ఎనిమిదో తరగతి నుంచి సాహిత్యం మీద ఆసక్తి. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రతిరోజూ తెల్లవారుజామున మూడున్నర గంటల నుంచి నాలుగున్నర వరకు పుస్తకాలు చదవడం అలవాటు. పుస్తకాలు చదవడం వల్ల విజ్ఞానం మరింత పెరుగుతుంది. కొత్త విషయాలు తెలుసుకోవడానికి ఆస్కారం ఉంటుంది. తుదిశ్వాస విడిచే సమయంలో కూడా పుస్తకం చదివితే బాగుండును అనే భావన పుస్తక ప్రియుల్లో ఉంటుంది. పది వేల పుస్తకాలతో హాస్పటల్లో ప్రత్యేక లైబ్రరీని ఏర్పాటు చేశాం. ప్రతిరోజూ వైద్యులు వాటిని చదువుతారు.

టెక్నాలజీ కూడా అవసరమే

ఎస్ఆర్‌కెఆర్ కళాశాల డైరెక్టర్ మంతెన జగపతిరాజు



మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీ కూడా మారుతుంది. పుస్తక పఠనంతో పాటు నేటి యుగంలో టెక్నాలజీ కూడా అవసరమే. మంచి పుస్తకం ఎలా దోహదపడుతుందో మారుతున్న జీవనశైలికి కూడా టెక్నాలజీ ఉపయోగం ఎంతో ఉంది. ప్రపంచ అభివృద్ధిలో టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుంది. పుస్తకాల్లో కూడా విలువైన సమాచారాన్ని కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది.

బాలికల చదువు సమాజానికి వెలుగు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

బాలికల చదువు సమాజానికి వెలుగునిస్తుందని సిడిపిఒ ఎం.ఉమా తెలిపారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా మంగళవారం లంకలకోడేరు హైస్కూల్ బాలికలకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ ఎం.ఉమా మాట్లాడుతూ బాలికలు బాలురతో సమాన హక్కులు కలిగి ఉంటారని, విద్య, ఉపాధి కోసం బాలికలు బాలురతో పోటీ పడాలని తెలిపారు. బాలికల చదువు సమాజానికి వెలుగునిస్తుందని, అభివృద్ధిలో ముందుకు నడిపిస్తుందని తెలిపారు. దేశ అభివృద్ధికి బాలికల చదువు చాలా ముఖ్యం కాబట్టి బాలికలు చక్కగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరాలని కోరారు. బాలికల్లో రక్తం 12 శాతానికి తక్కువ కాకుండా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు, ఉపాధ్యాయులు జె.నరసింహులు, డి.అప్పారావు, ఎ.రామలక్ష్మి, కెవిఆర్.సురేష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీల్లో పనులపై తనిఖీ

పాలకొల్లు రూరల్:మండలంలోని 27 గ్రామాల్లో ఉపాధి హామీ చట్టానికి సంబంధించి ఎస్ఆర్‌పిటి వెంకటేశ్వరరావు బృందం గ్రామాల వారీగా తనిఖీలు నిర్వహించింది. దీనికి సంబంధించి సామాజిక తనిఖీ ప్రజావేదిక మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రొసెండింగ్ అధికారి డాక్టర్ సిహెచ్ అప్పారావు అధ్యక్షతన జరిగింది. గ్రామ పంచాయతీల్లో గ్రామాల వారీగా తనిఖీ చేసి గుర్తించిన అంశాలు ఈ ప్రజావేదిక వద్ద చర్చించి తుది నిర్ణయం తీసుకోవడం జరిగిందని ప్రొసీడింగ్ అధికారి అప్పారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అధికారి కె.పురుషోత్తం, ఎస్‌టిఎం కె.కొనయ్య, ఎంపిడిఒ ఎన్.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కులు అందజేత

నరసాపురం:పట్టణంలో లబ్ధిదారులకు మంగళవారం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. పట్టణంలోని పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి రూ.11,58,625 చెక్కు అందజేశారు. సిఎం సహాయ నిధి పేదల పాలిట వరమని, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నాయకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కోటిపల్లి వెంకటేశ్వరరావు, జక్కం బాబ్జి, ఘంటా కృష్ణ, వల్లభ రెడ్డి రామకోటి పాల్గొన్నారు.

రోడ్డు అనుసంధానం కోరుతూ నిరసన

మొగల్తూరు:ముత్యాలపల్లి గ్రామంలోని జాతీయ రహదారి నుంచి గెద్దాళ్ల వంపు వెళ్లే రోడ్డు మార్గం అనుసంధానం చేయాలని గ్రామస్తులు మంగళవారం నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడారు. రోడ్డు అనుసంధానం సరిగ్గా లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు అనుసంధాన మార్గాన్ని ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామాజిక సేవ కార్యకర్త నాగిడి రాంబాబు, దొంగ శ్రీను, కవూరు రమేష్, మామిడిశెట్టి నాగరాజు, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు ఇకెవైసి అప్‌డేట్ చేయించుకోవాలి

కాళ్ల:మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీకి సంబంధించి జాబ్ కార్డులు కలిగిన కార్మికులు ఆయా గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా తప్పనిసరిగా ఇకెవైసి అప్‌డేట్ చేయించుకోవాలని ఎపిఒ కె.శ్రీనివాసరావు తెలిపారు. పెదఅమిరం గ్రామంలో ఇకెవైసి అప్‌డేట్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకెవైసి అప్‌డేట్ చేయించుకోని కూలీలు ఇకపై ఉపాధి హామీ పనులకు హాజరు కావడం, పనులు పొందడం సాధ్యం కాదన్నారు. కూలీలకు వ్యక్తిగత పనులను శాంక్షన్ చేయడం కూడా కుదరదన్నారు. మండలంలో మొత్తం జాబ్ కార్డులోని వేతనదారులు 11,815 మంది ఉన్నారని, ఆధార్ సీడింగ్ అయిన వారు 11,792 మంది అని తెలిపారు. అన్ని గ్రామాల్లో ఇప్పటి వరకూ 4,854 మంది వేతనదారులకు ఇకెవైసి ఎన్రోల్మెంట్ చేశామన్నారు. ఈ ప్రకియ ఈ నెల 20వ తేదీకి పూర్తి చేయాలని ఎంపిడిఒ జి.స్వాతి, ఫీల్డ్ అసిస్టెంట్ల సమీక్షా సమావేశంలో ఆదేశించారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి డొక్కు సోమేశ్వరరావు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన

తాడేపల్లిగూడెం:ప్లాస్టిక్ వినియోగం మానాలని, మట్టి పాత్రలు, నార సంచులు, అడ్డాకులు వాడాలని డైమండ్స్ లయన్స్ క్లబ్ ఛైర్మన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక గుణ్ణం ఫంక్షన్ హాల్లో క్లబ్ ట్రెజరర్ లయన్ బడుగు చంద్ర శేఖర్ అధ్యక్షతన కేన్సర్‌పై ఎవేర్నెస్ కార్యక్రమం చేపట్టారు. వాత్సల్య స్కిన్ హెయర్ క్లినిక్ డాక్టర్ మైథిలి మాట్లాడుతూ పరిశుభ్రత పాటించాలని, పర్యావరణ పరిరక్షణ పాటించాలని తెలిపారు. సహజ సిద్ధమైన డి విటమిన్ కోసం ఉదయం సూర్య రశ్మి పడేలా యోగా మెడిటేషన్ వంటివి చేయాలని తెలిపారు. వేడి ఆహారం పదార్థాలు ప్లాస్టిక్ కవర్లలో తీసుకు రావడం చాలా ప్రమాదకరం అన్నారు. అది కేన్సర్‌కు దారితీసే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యోగా సభ్యులు లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

తగ్గిన జిఎస్‌టితో ప్రజలకు మేలు

ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

తగ్గిన జిఎస్‌టితో ప్రజలు ఎంతో మేలు జరుగుతుందని, సగటున మనిషికి రూ.3 వేలు ఆదా అవుతుందని ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం కాస్మో పాలిటిన్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సూపర్ జిఎస్‌టి బెన్ఫిట్ బజార్‌ను ఎంఎల్‌ఎ అంజిబాబు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి ప్రారంభించారు. ముందుగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్స్‌ను స్వయంగా సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంఎల్‌ఎ అంజిబాబు మాట్లాడుతూ 5 రోజులపాటు జరిగే ఈ ప్రదర్శనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, బజార్‌లో వివిధ వస్తువుల తగ్గింపుపై అమ్మకాలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఉదయం 10 నుండి రాత్రి 9 గంటల వరకు బజాజ్ తెరిచి ఉంటుందని, ప్రవేశం ఉచితమని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, తహశీల్దార్, అసిస్టెంట్ కమిషనర్, జిఎస్‌టి అధికారులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ ప్రయోజనం చేకూరుస్తున్న జిఎస్‌టి ఫలాల ప్రచారాన్ని జన బాహుళ్యంలోకి విస్తృతంగా తీసుకెళ్లాలని రాజ్యసభ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ అన్నారు. జువ్వలపాలెం రోడ్డులోని కాస్మో పాలిటన్ క్లబ్ వద్ద ఏర్పాటుచేసిన భీమవరం సూపర్ జిఎస్‌టి బెనిఫిట్ బజార్‌ను రాజ్యసభ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్ని షాపుల్లో ప్రదర్శించిన వస్తువులను పరిశీలించి జిఎస్‌టి తగ్గింపుపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాజ్యసభ సభ్యులు వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ బెనిఫిట్ బజార్ వద్ద ప్రదర్శన, అమ్మకం ఐదు రోజులపాటు కొనసాగుతుందన్నారు. కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ జిఎస్‌టి తగ్గింపుతో వచ్చిన ఆర్థిక లాభంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. జెసి రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడారు. అనంతరం భీమవరం బెనిఫిట్ బజార్ లోగోను రాజ్యసభ సభ్యులు, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. వాణిజ్య పన్ను శాఖ డిప్యూటీ కమిషనర్ కెపి శైలజ, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ టి.సుశీల, భీమవరం ఆర్‌డిఒ ప్రవీణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

గణపవరం:ప్రభుత్వాలు అమలు చేసిన జిఎస్‌టి సంస్కరణల వల్ల ధరలు తగ్గుతాయని ఎంపిడిఒ ఆర్.బేబి శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్‌లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించే విధంగా భారీ ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ర్యాలీని ఎంపిడిఒ బేబీ శ్రీలక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ జిఎస్‌టి వల్ల కలిగే లాభాలను ప్రజలకు అవగాహన కల్పించడానికి మండలంలో ప్రతి గ్రామంలో ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ర్యాలీ సరిపల్లి గణపవరం పోలీస్ ఐలాండ్ వరకూ సాగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు ఎంపిటిసిలు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నరసాపురం : పట్టణంలోని 13వ వార్డులో భవన నిర్మాణ సామగ్రిపై జిఎస్‌టి తగ్గింపుపై అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ నాయకర్ మాట్లాడుతూ సిమెంట్‌పై పన్ను 28 నుండి 18 శాతానికి, మార్బుల్స్, గ్రానైట్ బాక్స్‌పై పన్ను 12 నుండి 5శాతానికి తగ్గిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసిరాజు, కమిషనర్ ఎం.అంజయ్య, తహశీల్దార్ ఐవివి సత్యనారాయణ, ఎఎంసి ఛైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

పంచారామాలకు ప్రత్యేక బస్సులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

కార్తీకమాసం సందర్భంగా నరసాపురం డిపో నుంచి పంచారామ క్షేత్రాలకు ఈ నెల 26న, నవంబర్ 2, 9, 16వ తేదీల్లో స్పెషల్ బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సత్తి సుబ్బన్న రెడ్డి తెలిపారు. మంగళవారం మార్టేరు కార్గో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ బస్సులు ఆయా తేదీల్లో రాత్రి 7 గంటలకు బయలుదేరి అమరావతి, ద్రాక్షారామం, సామర్లకోట, భీమవరం, పాలకొల్లు ఈ ఐదు క్షేత్రాలు ఒకేరోజులో దర్శించుకొని తిరిగి మర్నాడు రాత్రికి డిపోకు చేరుతాయని అన్నారు. పంచారామాలకు టికెట్ ధరలు పల్లె వెలుగు బస్సు 720 రూపాయలు, యుపివిజి బస్సు 800 రూపాయలు, ఎక్స్‌ప్రెస్ బస్సుకు 900 రూపాయలు, సెమీ లగ్జరీ బస్సుకు 1200 రూపాయలు అని తెలిపారు.

క్షయ నివారణకు సిబ్బంది కృషి చేయాలి

ప్రజాశక్తి - గణపవరం

క్షయ నివారణకు స్థానిక పిహెచ్‌సి వైద్య సిబ్బంది కృషి చేయాల్సిన అవసరం ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ కన్సల్టెంట్ డాక్టర్ ధీరజ్ అన్నారు. మంగళవారం గణపవరం పిహెచ్‌సిని సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రోగులకు జరుగుతున్న చికిత్స, మందుల సరఫరాలపై సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గణపవరం ఇన్‌ఛార్జి డాక్టర్ సిహెచ్ ధనలక్ష్మి, సిహెచ్‌ఒ జాలాది విల్సన్, అత్తిలి ఎస్‌టిఎల్ఎస్ టిబి సూపర్‌వైజర్ గిరి, శ్రావణ్, యోహాన్ పాల్గొన్నారు.